సాక్షి అనకాపల్లి

సోమవారం । 15 । సెప్టెంబర్ । 2025



ఓజోన్ పొరను కాపాడుకుందాం

పెందుర్తి: ఓజోన్ డే సందర్భంగా గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం ఎస్సీ బాలికల హాస్టల్లో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.



ఇస్కాన్‌లో మార్మోగిన హరినామస్మరణ 8లో



అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు 8లో

పెందుర్తిలో 'కూటమి' సిగపట్లు

- పెత్తనం కోసం ఎమ్మెల్యే పంచకర్ల.. టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జి పాట్లు
- ఒకరిపై ఒకరు తమ తమ అధిష్టానానికి ఫిర్యాదులు
- మీడియా ముఖంగా బహిర్గతం చేసిన గండి బాబ్జి

8లో

పత్రికా స్వేచ్ఛను హరిస్తామంటే ఎలా?



ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగం, ప్రభుత్వాల దృష్టికి తీసుకురావడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుంది. అలాంటి పత్రికల స్వేచ్ఛను పోలీసు కేసులతో ప్రభుత్వం హరిస్తామంటే ఎలా..? ఇటీవల సాక్షిలో ఒక రాజకీయ పార్టీ నేత మాట్లాడిన ప్రెస్‌మీట్‌ను వార్తగా రాస్తే.. సంబంధిత జర్నలిస్టుపై, ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై అక్రమ కేసు పెట్టి ప్రభుత్వం వేధిస్తోంది. ప్రజల గొంతుకుగా నిలిచే మీడియా గొంతును నులిమే ప్రయత్నాలకు కూటమి ప్రభుత్వం పాల్పడుతోంది. అక్షరాన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛను నోటీసులు, అక్రమ కేసులతో పోలీసులు నిరోధించలేరు. మొదటి నుంచి కూటమి ప్రభుత్వం వాస్తవాలను వెలుగులోకి తెస్తున్న సాక్షిపై వేధింపుల ధోరణికే పాల్పడుతోంది. ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. పత్రికలపై కక్ష కట్టిన ఏ నాయకుడూ బాగుపడిన దాఖలా చరిత్రలో లేదు.

– కరణం ధర్మశ్రీ, ప్రభుత్వ మాజీ విప్



రాజ్యాంగాన్ని గౌరవించడం లేదు



ప్రపంచంలోనే అత్యంత దృఢమైనదని భారత రాజ్యాంగానికి పేరు. అలాంటి రాజ్యాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం గౌరవించడం లేదు. ప్రజలకు వాస్తవాలు తెలియకుండా ఉండడానికే మీడియాను అణగదొక్కుతున్నారు. రాజ్యాంగం ఇచ్చిన భావ ప్రకటనా స్వేచ్ఛను హరించేస్తున్నారు. ఒక రాజకీయ నాయకుడి ప్రెస్‌మీట్‌ను వార్తగా రాస్తే కేసు ఎలా నమోదు చేస్తారు? ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినట్లే. రాజకీయ పార్టీల నాయకులు ప్రెస్‌మీట్‌ల ద్వారా వెల్లడించిన అంశాలను వార్తగా మలిచే హక్కు జర్నలిస్టులకు ఉంటుంది. నాయకులు మీడియా సమావేశాలు పెట్టి అనేక అంశాలు మాట్లాడతారు. వాటిని వార్త రూపంలో ప్రజలకు చేరవేయడంతో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తారు. అంతమాత్రాన వార్త రాసిన జర్నలిస్టుపై, పత్రిక ఎడిటర్‌పై కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేడయం సరికాదు.

– తైనాల విజయకుమార్, మాజీ ఎమ్మెల్యే

రగులుతున్న రాజయ్యపేట

- బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా నిరాహార దీక్షకు సిద్ధపడ్డ మత్స్యకారులు
- అనుమతి నిరాకరించిన పోలీసులు
- భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు సమావేశమైనా ఆటంకాలు
- టెంట్లపై వాహనాలు నిలపడంతో పోలీసులతో వాగ్వాదం
- మండుటెండలో నిరసనకు దిగిన గంగపుత్రులు
- ఏడు గంటలపాటు బైఠాయించిన బాధితులు

గంగపుత్రుల గొంతు నొక్కేశారు.. తమ ఆవేదన వెలిబుచ్చే అవకాశాన్ని కాలరాశారు.. బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా శాంతియుత నిరసనకు సిద్ధపడ్డ మత్స్యకారులను పోలీసులు అడ్డుకున్నారు. అనుమతి నిరాకరించడమే కాక.. భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించడానికి ఎండలో టెంటు వేసుకుంటామన్నా ఒప్పుకోలేదు. దీంతో మండుటెండలో ఏడు గంటలపాటు మత్స్యకారులు ధర్నా చేశారు.



టెంట్లు వేయకుండా అడ్డుకోవడంతో తాటికమ్మలు పట్టుకుని ఆందోళన చేస్తున్న మత్స్యకారులు



మహిళలతో కలిసి ఆందోళనకు దిగిన మత్స్యకారులు

నక్కపల్లి: రాజయ్యపేటలో మళ్లీ నిరసన సెగ రగిలింది. ఈ గ్రామ సమీపంలో నిర్మిస్తున్న బల్క్‌డ్రగ్ పార్క్‌ను నిలిపివేయాలంటూ తాము చేపట్టిన శాంతియుత నిరాహారదీక్షను పోలీసులు అడ్డుకోవడంతో మత్స్యకారులు మండిపడ్డారు. కనీసం తమకు ఆవేదన వెలిబుచ్చే హక్కు కూడా లేదా అని ఆగ్రహంతో ఊగిపోయారు. తమ గ్రామంలో భారీ మెజారిటీ ఇచ్చినందుకు ఇదేనా బహుమానం అని కోపంతో నిలదీశారు. రాజయ్యపేట సమీపంలో బల్క్‌డ్రగ్ పార్క్ నిర్మిస్తే మత్స్య సంపద నశిస్తుందని, ఈ ప్రాజెక్టును నిలిపివేయాలని కోరుతూ మత్స్యకారులు ఆదివారం నిరాహారదీక్షను తలపెట్టారు. అయితే అనుమతి లేదంటూ పోలీసులు టెంట్లపై తమ జీపులను నిలబెట్టడంతో గంగపుత్రులు తీవ్ర మనస్తాపం చెందారు. పోలీసులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమను నమ్మించి మోసం చేశారంటూ హోం మంత్రి వంగలపూడి అనితపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. కేసులకు భయపడేది లేదని, నిరాహారదీక్షలు చేసి తీరుతామంటూ దీక్ష చేసే ప్రాంతం వద్ద ఏడు గంటలపాటు తీవ్రమైన ఎండలో ఆందోళన కొనసాగించారు. ముమ్ముందు మరింత ఉధృతంగా పోరాడేందుకు సిద్ధపడుతున్నారు.

మత్స్యసంపదకు ముప్పు కలిగించొద్దు

ప్రభుత్వం రాజయ్యపేట సమీపంలో 2 వేల ఎకరాల్లో రూ.1800 కోట్ల వ్యయంతో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో బల్క్‌డ్రగ్ పార్క్ నిర్మిస్తోంది. దీనికి సంబంధించిన పనులు మూడు నెలల నుంచి చురుగ్గా జరుగుతున్నాయి. అయితే ఈ బల్క్‌డ్రగ్ పార్క్ వల్ల మత్స్యకారులు, సమీప ప్రాంతాలల్లో నివసించేవారి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని, సముద్రంలోకి వేసే పైపులైన్ల వల్ల మత్స్య సంపద నాశనమవుతుందని, జీవనోపాధి కోల్పోయి మత్స్యకారులు ఇతర ప్రాంతాలకు వలస పోవాల్సి వస్తుందని రాజయ్యపేట, బోయపాడు, దొండవాక తదితర గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఆందోళన చేస్తున్నారు. ర్యాలీలు, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకుండా తమ పనులు కొనసాగిస్తోంది. హోం మంత్రి అనితను కూడా మత్స్యకారులు కలిసి సమస్యను వివరించారు. అయినప్పటికీ ఫలితం దక్కలేదు. దీంతో మత్స్యకారులు పనులు చేసే చోట శాంతియుతంగా నిరాహార దీక్షలు చేస్తామని, అనుమతి ఇవ్వాలని కోరుతూ పోలీసులకు దరఖాస్తు చేశారు. పోలీసులు అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆదివారం గ్రామస్తులంతా ఊరి చివరన సముద్రపు ఒడ్డుకు సమీపంలో భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకునేందుకు సమావేశమయ్యారు. ఎండగా ఉందని టెంట్లు వేసే సమయంలో నక్కపల్లి, ఎస్.రాయవరం సీఐలు కుమారస్వామి, రామకృష్ణ, ఎస్‌ఐలు సన్నిబాబు, అంజుల ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. టెంట్లపై పోలీసు జీపులను ఉంచి టెంట్లు వేయకుండా అడ్డుకున్నారు. దీంతో మత్స్యకారులు, మహిళలు ఆగ్రహంతో ఊగిపోయారు. మండుటెండలో తాటి కమ్మలు చేత పట్టి, ఎండ తగలకుండా ఆందోళన కొనసాగించారు. పనులు అడ్డుకోవడం, దీక్ష చేపట్టకుండానే పోలీసులు తమను బెదిరించడం, టెంట్లపై జీపులు పెట్టడం సరికాదని మత్స్యకార నాయకుడు ఎరిపిల్లి నాగేశు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలకు హాని కలిగించే బల్క్‌డ్రగ్ పార్క్ రద్దు చేయాల్సిందేనన్నారు. విషయం తెలుసుకున్న సీపీఎం నాయకుడు ఎం.అప్పలరాజు తదితరులు సంఘటన స్థలానికి చేరుకొని మత్స్యకారులకు సంఘీభావం తెలిపారు. పోలీసుల వైఖరి సరికాదన్నారు. టెంట్లు వేయకుండా పోలీసులను అడ్డుకున్నట్టు తెలుసుకుని వందలాది మంది మహిళలు వచ్చి ఆందోళనలో పాల్గొన్నారు.

రాజయ్యపేటను అమ్మేశావా అనితమ్మా..

ఈ సందర్భంగా పలువురు మత్స్యకారులు, మహిళలు హోం మంత్రి వంగలపూడి అనితపై తీవ్రస్థాయిలో దుమ్మెత్తిపోశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చిన అనిత ఇప్పుడు కనిపించడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామాన్ని కంపెనీల కోసం అమ్మేశారంటూ ఆరోపించారు. ఇంటింటికీ తిరిగి మీ ఆడపడుచును అంటూ ఓట్లు వేయించుకుని తీరా గెలిచిన తర్వాత ముఖం చాటేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనిత అండదండలతోనే పోలీసులు తమ దీక్షలను అడ్డుకుంటున్నారన్నారు. ఇంతకంటే దారుణం ఎక్కడా ఉండదన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఆందోళన సాయంత్రం ఐదుగంటల వరకు కొనసాగింది. ఎన్ని అడ్డంకులు సృష్టించినా దీక్ష చేసి తీరుతామని మత్స్యకారులు చెబుతున్నారు. గ్రామస్తులంతా ఏకమై పోరాడుతున్న ఈ సమస్యపై ఒక నిర్ణయం తీసుకునేందుకు ఏర్పాటు చేసుకున్న సమావేశంపై పోలీసులు ఆంక్షలు విధించడం సమంజసం కాదని సీపీఎం నాయకులు అప్పలరాజు అన్నారు. ఈ ఆందోళనలో మత్స్యకార నాయకులు ఎం.సూరిబాబు, పిక్కి సత్తియ్య, ఎం.మహేష్‌బాబు, సోమేశ్వరరావు, డి.నానాజీ, నరేష్, మాధవ్, కె.కాశీ, పి.నల్ల, సిహెచ్ వసంతమ్మ, రామ్‌చరణ్ పలువురు మహిళలు పాల్గొన్నారు.

ధర్నా చేసిన మత్స్యకారులపై కేసులు

బల్క్‌డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ ఆదివారం రాజయ్యపేటలో నిరాహార దీక్షకు ప్రయత్నించిన 13మంది మత్స్యకారులపై నక్కపల్లి పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసులు అడ్డుకున్నప్పటికీ మత్స్యకారులు ధర్నా కొనసాగించారు. ప్రభుత్వ అధికారుల ఆదేశాలు ఉల్లంఘించి ధర్నా చేసినందుకు ఎరిపిల్లి నాగేశ్వరరావు, మైలపల్లి మహేష్, మైలపల్లి బైరాగి, గోసల స్వామి, కోడ కాశీరావు, పిక్కి రాము, మైలిపల్లి సూరిబాబు, మైలిపల్లి జాను, మైలపల్లి రాజు, పిక్కి కోదండ రాజు, చోడిపల్లి కాశీ, పిక్కి సత్తియ్య, మేడిబోయిన అప్పలరాజులతోపాటు మరికొంతమందిపై కేసులు నమోదు చేసినట్టు సీఐ కుమారస్వామి తెలిపారు.

కంటి మీద కునుకు లేదు

- అర్ధరాత్రి మోహరించిన పోలీసులు
- మత్స్యకార నేత నాగేశు అరెస్టుకు యత్నాలు
- అడ్డుకున్న మహిళలు.. గ్రామంలో ఉద్రిక్తత
- కొనసాగుతున్న ఆందోళన



అర్ధరాత్రి గ్రామంలోకి ఎందుకొచ్చారంటూ పోలీసులను నిలదీస్తున్న మహిళలు



అర్ధరాత్రి పోలీసుల రాకతో నాగేశు చుట్టూ కాపలా ఉండి ఆందోళన కొనసాగిస్తున్న మత్స్యకారులు (సర్కిల్‌లో నాగేశు)

నక్కపల్లి: రాజయ్యపేటలో ఆదివారం అర్ధరాత్రి తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బల్క్‌డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న నాయకులను అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ గ్రామానికి చెందిన మహిళలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అర్ధరాత్రి సమయంలో గ్రామంలోకి ఎందుకొచ్చారంటూ నిలదీశారు. మత్స్యకారుల ఆందోళనకు నాయకత్వం వహించిన ఎరిపిల్లి నాగేశ్వరరావు (నాగేశు)కు నోటీసులు ఇచ్చి అరెస్టు చేసేందుకు పోలీసులు వెళ్లినట్లు ఆందోళనకారులు తెలిపారు. నోటీసులు తీసుకోడానికి నిరాకరించామని, నోటీసు తీసుకున్నా తీసుకోకపోయినా అరెస్టు చేస్తామని పోలీసులు హెచ్చరించినట్లు నాగేశు తెలిపాడు. నాగేశును అరెస్టు చేయడానికి పోలీసులు వచ్చిన విషయం తెలుసుకున్న వందలాది మంది మహిళలు, గ్రామస్తులు పోలీసులను చుట్టుముట్టారు. ఉదయం ఆందోళన చేసిన ప్రాంతంలోనే మహిళలంతా ఆందోళన కొనసాగిస్తున్నారు. నాగేశు అరెస్టును అడ్డుకుంటామంటూ మహిళలు ముక్తకంఠంతో చెబుతున్నారు. అర్ధరాత్రి సమయంలో అధిక సంఖ్యలో పోలీసులు గ్రామంలోకి రావడంతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. పోలీసుల రాకను నిరసిస్తూ గ్రామంలో రాత్రి 11 గంటలు దాటాక కూడా పిక్కి నూకరాజు, కారే వెంకటేష్, అర్జల్లి మాధవ, పిక్కి కాశీ, మైలపరి సూరిబాబు తదితరులతోపాటు వందలాది మంది మహిళలు ఆందోళన కొనసాగిస్తున్నారు. నాగేశును పోలీసులు తీసుకెళ్లకుండా కాపలా ఉన్నారు.

వాల్తేరు డివిజన్‌లో రైల్వే పనులపై సమీక్ష



అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం (విశాఖ): వాల్తేరు డివిజన్‌లో జరుగుతున్న సివిల్ ఇంజనీరింగ్ విభాగం పనులపై డీఆర్‌ఎం డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆధునీకరించిన సివిల్ ఇంజనీరింగ్ సమావేశ మందిరంలో ఈ సమావేశం జరిగింది. రైల్వే భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. రద్దీ సీజన్లలో వివిధ విభాగాల మధ్య సమన్వయం మెరుగుపరుచుకోవడం ద్వారా డివిజన్ పనితీరు మరింత మెరుగవుతుందని ఆయన తెలిపారు. సమీక్షలో భాగంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, నిర్వహణ పనులు, అమృత్ భారత్ స్టేషన్ పనులు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో చేపట్టాల్సిన చర్యలు, కొండచరియల ప్రాంతాలలో భద్రతా పనుల గురించి చర్చించారు. ఆధునీకరించిన సమావేశ మందిరాన్ని ప్రారంభించారు.





ఓనం..ఆనందం

విభిన్న సంస్కృతుల సమ్మేళనమైన విశాఖ నగరంలో కేరళ సాంస్కృతిక వైభవం వెల్లివిరిసింది. తమ సంప్రదాయాలను భావితరాలకు అందించే లక్ష్యంతో, కేరళీయులు ఆదివారం బిర్లా కూడలి సమీపంలోని కేరళ కళాసమితిలో ఓనం వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. 8లో

'ప్రగాఢ' అవిశ్వాసం

ఎమ్మెల్యే వర్గీయులపై ప్రగడ నాగేశ్వరరావు కారాలు, మిరియాలు



ఫ్లైఓవర్ పనులు పరిశీలిస్తున్న రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వరరావు



దుప్పితూరులో సీసీ రోడ్డు నిర్మాణంలో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం

అచ్యుతాపురం రూరల్: యలమంచిలి రాజకీయాలు రోజురోజుకు రసకందాయంలో పడుతున్నాయి. నియోజకవర్గానికి టీడీపీ ఇన్‌చార్జినైన తనకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌పై, ఆయనతో సన్నిహితంగా ఉంటున్న టీడీపీలోని వైరి వర్గంపై రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు కారాలు, మిరియాలు నూరుతున్నారు. దుప్పితూరు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రగడ ఆదివారం పరిశీలించారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం వచ్చిన కాంక్రీట్ లారీని దుప్పితూరు గ్రామానికి చెందిన టీడీపీ మాజీ సర్పంచ్ కుమారుడు ప్రగడ జూనియర్ నాగేశ్వరరావు అడ్డుకున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరగడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో గతంలో నిర్మించిన రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. రహదారి నిర్మాణాన్ని ఎమ్మెల్యే అండదండలతో దురుద్దేశంతో అడ్డుకోవడానికి ప్రయత్నించారన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో లేనిపోని విభేదాలు సృష్టించవద్దని నాయకులకు హితవు పలికారు.

ఫ్లైఓవర్ నిర్మాణంలో లోపించిన నాణ్యతా ప్రమాణాలు

ఫ్లైఓవర్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు లోపించాయని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. అచ్యుతాపురంలో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణం పనుల్లో ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎటువంటి అవగాహనలేని కాంట్రాక్ట్ లేబర్‌ను పెట్టి పనులు చేయిస్తున్నారన్నారు. దీంతో ప్రమాదాలు జరగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ రహదారులు లేక ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురతున్నారని చెప్పారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి, అధికారుల పర్యవేక్షణలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు.

సముద్రంలో కొట్టుకుపోయిన వ్యక్తిని కాపాడిన మెరైన్ పోలీసులు



సురక్షితంగా బయటపడ్డ శివసాయితో మెరైన్ పోలీసులు

ఎస్.రాయవరం: రేవుపోలవరం తీరంలో సముద్రంలో స్నానానికి దిగిన వ్యక్తి మునిగిపోతుండగా ఒడ్డున ఉన్న మెరైన సీఐ మురళీరావు సిబ్బందితో వెళ్లి కాపాడారు. చోడవరం మండలం గౌరీపట్నం గ్రామానికి చెందిన కర్రి శివసాయి (28) బంధువులతో వచ్చి తీరంలో స్నానం చేస్తుండగా పెద్ద అల రావడంతో సముద్రం లోపలికి వెళ్లి మునిగిపోయాడు. వెంటనే బంధువులు కేకలు వేయడంతో సీఐ మురళీరావు, ఎస్ఐ దొర, ఏఎస్ఐ కృష్ణ, కానిస్టేబుల్ చిన్నబాబు, హోం గార్డులు శివ, శ్రీను మునిగిపోతున్న శివసాయికి లైఫ్ జాకెట్ అందించి ఒడ్డుకు చేర్చారు. దీంతో శివసాయికి ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మెరైన్ సీఐ, సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి సముద్రంలో మునిగిన వ్యక్తిని కాపాడినందుకు వారికి అభినందలు తెలిపారు. వీకెండ్‌లో రేవుపోలవరం తీరానికి వస్తున్న పర్యాటకుల రక్షణ కోసం పెంటకోట మెరైన్ స్టేషన్ సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నామని సీఐ చెప్పారు.

నేడు ఉపమాకలో వైష్ణవ కృష్ణాష్టమి

యశోద అలంకరణలో గోదాదేవి అమ్మవారు



యశోదగా గోదాదేవి అమ్మవారు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమ, మంగళవారాల్లో వైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ఆలయంలో నిత్యపూజా కార్యక్రమాలు, బాలభోగ నివేదనలు, నిత్య హోమాలు, తీర్థగోష్ఠి, యథావిధిగా జరుగుతాయన్నారు. కృష్ణ పరమాత్మకు ఉగ్గుపాలు పడుతున్నట్టు గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తులకు యశోదాదేవి అలంకరణ చేస్తారని చెప్పారు. సాయంత్రం ఆలయంలో విశేష అలంకరణలో ఉన్న యశోదాదేవికి, శ్రీదేవి భూదేవి సమేత కల్కి వేంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులకు, ఆలయ క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి నీరాజనాలు సమర్పించిన తర్వాత భక్తులందరికీ విశేష ప్రసాద నివేదన ఉంటుందన్నారు. అనంతరం గరుడాద్రి పర్వతంపై స్వయం వ్యక్తమై వెలసిన మూలమూర్తికి ప్రత్యేక అభిషేకం, విశేష ప్రసాద నివేదనలు, తీర్థగోష్ఠి నిర్వహిస్తామన్నారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు స్వామివారి ఆస్థాన మండపంలో ఉభయ దేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవమూర్తులను, బుల్లి కృష్ణుడిని స్వామివారి పీఠంపై అధిష్ఠింపజేసి ముందుగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, వెన్నతో కూడిన ఉట్టికి ప్రత్యేక ఆరాధనలు అనంతరం, ఏకాంతంగా ఉట్టి కొట్టే సంబరాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.

క్లుప్తంగా

పరారీలో ఉన్న గంజాయి నిందితుడు అరెస్టు


గంజాయి నిందితుడితో ఎస్‌ఐ రామకృష్ణారావు

రోలుగుంట: పరారీలో ఉన్న గంజాయి కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్‌ఐ పి. రామకృష్ణారావు ఆదివారం తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం ముంతమామిడి గ్రామానికి చెందిన పాంగి నారాయణ(25) రెండేళ్లుగా తప్పించుకు తిరుగుతున్నాడని, ప్రత్యేక బృందాలతో గాలించి పట్టుకుని, రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ చెప్పారు.

పది మంది పేకాటరాయళ్ల అరెస్ట్

బుచ్చెయ్యపేట: మండలంలోని కరక గ్రామంలో నిర్వహించిన పేకాట శిబిరంపై ఆదివారం దాడి చేసినట్టు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. పది మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.30,170 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండాలి


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రమేష్, సిబ్బంది

నర్సీపట్నం: వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండాలని లేని పక్షంలో వాహనాలను సీజ్ చేస్తామని టౌన్ ఎస్‌ఐ రమేష్ హెచ్చరించారు. ఆదివారం ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో ఎస్‌ఐ ఆధ్వర్యంలో పోలీసులు అధిక సంఖ్యలో మోహరించి, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రికార్డులు లేని వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. సుమారు 50 వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేదిలేదన్నారు.

పాత కక్షలతో దాడి

అనకాపల్లి టౌన్: పాత కక్షల కారణంగా ఓ వ్యక్తిపై కొత్తూరు ఎక్సైజ్ స్టేషన్ హైడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ దాడి చేసినట్టు పట్టణ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. సత్యనారాయణపరానికి చెందిన వీరంరెడ్డి భద్రరావు ఆదివారం గ్రామం నుంచి అనకాపల్లి వస్తుండగా మార్గమధ్యంలో శారదానది బ్రిడ్జిపై హెడ్‌కానిస్టేబుల్ కాపు కాసి దాడిచేసినట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇస్కాన్‌లో మార్మోగిన హరినామస్మరణ

కొమ్మాది(విశాఖ) : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో హరే కృష్ణ, హరే రామ నామస్మరణ ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజలు సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలు ఆలపించారు. ఈ నేపథ్యంలో రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఓనం.. ఆనందం

- విశాఖలో కేరళీయుల సాంస్కృతిక వైభవం
- అలరించిన కళా ప్రదర్శనలు


కేరళ యువతుల నాట్య ప్రదర్శన


నాట్యవిన్యాసంలో ప్రజలతో కలిసి పాల్గొన్న బలి చక్రవర్తి

మురళీనగర్: విభిన్న సంస్కృతుల సమ్మేళనమైన విశాఖపట్నంలో కేరళీయుల సాంస్కృతిక వైభవం వెల్లివిరిసింది. తమ వారసత్వాన్ని భావితరాలకు అందించే లక్ష్యంతో.. బిర్లా కూడలి సమీపంలోని కేరళ కళాసమితిలో ఆదివారం ఓనం వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇక్కడే స్థిర నివాసం ఏర్పరుచుకున్న కేరళీయులు నిర్వహించిన ఈ వేడుకలు కేరళ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టాయి. ముందుగా తమ ఆరాధ్య దైవమైన బలి చక్రవర్తికి స్వాగతం పలికే కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మేళతాళాల నడుమ మహిళలు దీపాలతో, ఛత్రంతో బలి చక్రవర్తిని వేదికపైకి ఆహ్వానించారు. ఆయన రాకతో సభాప్రాంగణం మొత్తం లేచి నిలబడి గౌరవాన్ని ప్రకటించింది. అనంతరం బలి చక్రవర్తి ప్రజలందరినీ ఆశీర్వదించి, సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి ముందు, మహిళలు పూలతో అందంగా అలంకరించిన 'ఓనపూక్కళం'వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రదక్షిణలు చేశారు. అనంతరం కేరళ ఎంపీ బెన్ని బెహనన్, ఎమ్మెల్యే ఎం.ఎస్. అరుణ్ కుమార్, ఇతర పెద్దలు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన 'తిరువాదిరకళి'నృత్యం, శాస్త్రీయ నృత్యమైన 'మోహినియాట్టం', పులివేషాలు, చెండమేళం వాయిద్య ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేరళ ఎంపీ బెన్ని బెహనన్ మాట్లాడుతూ.. ఎక్కడ ఉన్నా స్థానిక ప్రజలతో కలిసిపోతూ తమ సంస్కృతిని కాపాడుకోవడం కేరళీయుల ప్రత్యేకత అని అన్నారు. భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మావిలెక్కిర నియోజకవర్గం ఎమ్మెల్యే ఎం.ఎస్. అరుణ్ కుమార్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిలు కేరళీయులకు ఓనం శుభాకాంక్షలు తెలిపి, తమ పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ వేడుకల్లో భాగంగా 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన 8 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారు. నగరం నలుమూలల నుంచి సుమారు 1,500 మంది కేరళీయులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొన్నారు. చివరగా 29 రకాల పదార్థాలతో తయారు చేసిన కేరళీయుల ప్రత్యేక విందు భోజనం 'సాద్య'ను సామూహికంగా ఆరగించారు. కార్యక్రమంలో కేరళ కళాసమితి అధ్యక్షుడు జె.థామస్, జనరల్ సెక్రటరీ హరిదాస్, కైరళీ ఆర్ట్స్ క్లబ్ ప్రెసిడెంట్ శశిధరన్ పిళ్లై, వీఎండబ్ల్యూఏ అధ్యక్షుడు కేపీ వర్గీస్, కేంద్రసాహిత్య అవార్డు గ్రహీత నందినీ మేనన్ తదితరులు, పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న కేరళీయులు

ముగిసిన జిల్లా స్థాయి నృత్య పోటీలు


విజేతలతో నిర్వాహకులు

మద్దిలపాలెం(విశాఖ): ఎంవీపీ కాలనీలోని ఏపీఎస్‌ఈబీ వెల్ఫేర్ అసోసియేషన్ హాలులో రెండు రోజుల పాటు జరిగిన జిల్లా స్థాయి నృత్య పోటీలు ఆదివారం ముగిశాయి. భారతీయ శాస్త్రీయ, సంస్కృతి, సంప్రదాయ, జానపద నృత్యాలతో దాదాపు 300 మంది విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ పోటీలను స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్, ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించాయి. విజేతలకు వాకర్స్ ఇంటర్నేషనల్‌ట్రస్టీ కమల్‌బేడి, ఏపీఎస్‌ఈబీ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ కె.రామారావు, బ్రహ్మకుమారి రామేశ్వరి బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా స్కూల్‌ఆఫ్ థియేటర్‌ఆర్ట్స్ కొరియోగ్రాఫర్ ఆర్.నాగరాజు పట్నాయక్, విజయవేణి వ్యవహరించారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన సేవ విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర పూజ జరిపారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు.

వాల్తేరు డివిజన్‌లో అభివృద్ధి పనులపై సమీక్ష

తాటిచెట్లపాలెం(విశాఖ): వాల్తేరు డివిజన్‌లో జరుగుతున్న సివిల్ ఇంజినీరింగ్ విభాగం పనులపై డీఆర్‌ఎం డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బొహ్రా సమీక్షా సమావేశం నిర్వహించారు. సివిల్ ఇంజినీరింగ్ సమావేశ మందిరంలో ఈ సమావేశం జరిగింది. రైల్వే భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. రద్దీ సీజన్లలో వివిధ విభాగాల మధ్య సమన్వయం మెరుగుపరుచుకోవడం ద్వారా డివిజన్ పనితీరు మరింత మెరుగవుతుందని ఆయన తెలిపారు. సమీక్షలో భాగంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, నిర్వహణ పనులు, అమృత్ భారత్ స్టేషన్ పనులు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో చేపట్టాల్సిన చర్యలు, కొండచరియల ప్రాంతాలలో భద్రతా పనుల గురించి చర్చించారు. సమావేశానికి ముందు డీఆర్‌ఎం ఆధునీకరించిన సమావేశ మందిరాన్ని ప్రారంభించారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఉమ్మడి విశాఖ జిల్లా యూనియన్ సదస్సులో వక్తలు


సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు

అనకాపల్లి: గర్భిణులు, బాలింతలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.బసవరాజు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విశాఖ ఉమ్మడి జిల్లా యూనియన్ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.7,800 జీతంతో ఉద్యోగులతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని చెప్పారు. కనీస వేతనాలు అమలు చేయాలని ఎన్నిసార్లు విన్నవించినా ప్రభుత్వం, అరబిందో యాజమాన్యం పట్టించుకోవడం లేదని, పైగా యాజమాన్యం వేధింపులకు పాల్పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం చేయాలన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.దేవి ప్రసాద్ మాట్లాడుతూ 102 ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు వై.సతీష్, అల్లూరి జిల్లా అధ్యక్షుడు వి. వాసు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై నేడు శ్రీకృష్ణ జయంతి

సింహాచలం : సింహగిరిపై సోమవారం శ్రీకృష్ణ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6గంటల నుంచి ఆరాధన, దేవకీ అమ్మవారికి బేడామండపంలో తిరువీధి, శ్రీకృష్ణ ఆవిర్భావ ఘట్టం, బాల కృష్ణుడికి బేడా తిరువీధి, ఆస్థానమండపంలో అప్పన్న ఉత్సమూర్తుల చెంతన బాలకృష్ణుడికి విశేష పూజలు, భాగవత పురాణం, శ్రీకృష్ణ ఆవిర్భా విన్నపం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం 6గంటల వరకే దర్శనాలు లభిస్తాయని స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ తెలిపారు. అలాగే మధ్యాహ్నం 11.30 నుంచి 12.15 కూడా సమయంలో కూడా దర్శనాలు లభిస్తాయని పేర్కొన్నారు. అలాగే మంగళవారం సాయంత్రం 4.30 గంటల నుంచి రాజగోపురం వద్ద ఉట్ల సంబరాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఆచార్యులుకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

ఘనంగా సన్మానం


ఆచార్యులు మాస్టార్ని సన్మానిస్తున్న నిర్వాహకులు

నక్కపల్లి: మండలంలో పెదబోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎస్.వి.ఎస్. ఆచార్యులు మాస్టర్‌ను ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర శాఖ గుంటూరులో ఆదివారం ఘనంగా సన్మానించి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందజేసింది. ఈ నెల 5న గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని పురస్కారం అందజేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలో అంకిత భావంతో పనిచేస్తున్న బ్రాహ్మణ ఉపాధ్యాయులకు ఈ పురస్కారాలను అందజేస్తున్నట్టు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతికి చెందిన ఎస్.ఆర్. కృష్ణమూర్తి, నాగార్జున విశ్వవిద్యాలయం సంస్కృత విభాగానికి చెందిన డాక్టర్ మంజుల చింతలపాటి, కొత్తా ధర్మసంస్థల అధినేత కొత్తా సుబ్బారావు, రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, సంస్కృత విశ్వవిద్యాలయం అధ్యాపకుడు విష్ణువర్ధన్, రాష్ట్ర బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు మంగళంపల్లి అంజిబాబు, బందా రవి, రామభద్రుడు, కాణిపాకం ఆలయ అర్చక పురోహిత సంఘం ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, కార్యదర్శి అయ్యన్న పాల్గొన్నారు. 15 ఏళ్లుగా ఆచార్యులు మాస్టర్ విద్యార్థుల్లో విద్యా ప్రమాణాల మెరుగుకు, దాతల సహకారంతో పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. సెలవు రోజుల్లో గ్రామాల్లో పర్యటించి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో కోళ్ల కళేబరాలు పడేస్తే కఠిన చర్యలు

కె.కోటపాడు పశు సంవర్ధకశాఖ ఏడీ దినేష్‌కుమార్


కోళ్ల కళేబరాలను పూడ్చి వేయిస్తున్న ఏడీ దినేష్‌కుమార్

దేవరాపల్లి: బహిరంగ ప్రదేశాల్లో కోళ్ల కళేబరాలను పడేస్తే సదరు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని కె.కోటపాడు పశు సంవర్ధకశాఖ ఏడీ ఈ.దినేష్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని చేనులపాలెం కల్లాలు సమీపంలో సాగు నీటి చెరువు, కాలువల్లో గుట్టలు గుట్టలుగా పడేసిన కోళ్ల కళేబరాలను స్థానిక పశు వైద్యాధికారులు జి.గాయత్రీదేవి, కె.మంజుషారాణి, జి.ప్రియాంకతో కలిసి ఆదివారం పరిశీలించారు. స్థానిక పంచాయతీ సెక్రటరీ స్వామినాయుడు, వీఆర్వో రాజేంద్రకుమార్‌ల సమక్షంలో చెరువులోంచి వాటిని బయటకు తీయించి, గోతిలో పూడ్చి వేశారు. ఈ సందర్భంగా ఏడీ దినేష్‌కుమార్ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో కోళ్లు లేదా ఇతర జంతువుల కళేబరాలను పడేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన చెప్పారు.

'న్యాయవాదుల రక్షణకు చట్టాలను తీసుకురావాలి'


సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

అనకాపల్లి: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో న్యాయవాదులపై దాడులు అంతకంతకు పెరిగిపోతున్నాయని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.ఎస్.అజయ్ కుమార్ తెలిపారు.న్యాయవాదుల రక్షణకు తగిన చట్టాలను తీసుకురావాలన్నారు. స్థానిక గాంధీనగరం అసోసియేషన్ ఫర్ జస్టిస్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లిలో ఉన్న కోర్టుల్లో కనీస సదుపాయాలు కరవయ్యాయని, న్యాయమూర్తులు, కలెక్టర్ వెంటనే స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన కోరారు. న్యాయస్థానాల్లో మౌలిక వసతులు, ఇతర సమస్యలపై న్యాయ, మున్సిపల్ శాఖలకు లేఖలు రాయాలని తీర్మానం చేసినట్టు చెప్పారు. న్యాయవాది ఐ.ఆర్.గంగాధర్ మాట్లాడుతూ కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల రక్షణకు చట్టాన్ని తీసుకువచ్చిందని, రాజస్థాన్ రాష్ట్ర శాసనసభలో కూడా బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించారని చెప్పారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కూడా చట్టాలు తీసుకురావలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఇళ్ల అవినాష్ , ఓడిబోయిన రాంబాబు, చిట్టా జయశ్రీ, జి. బాలప్రభ, వడిసెల కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

బ్రాండిక్స్‌లో 580 మందికి కంటి పరీక్షలు


శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం: స్థానిక బ్రాండిక్స్‌లో ఆదివారం నిర్వహించిన 142వ ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 580 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 450 మందికి బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. మరో 140 మందికి మందులు పంపిణీ చేశారు. 57 మందికి కాటరాక్ట్ సర్జరీ అవసరమని వైద్యులు సూచించారు. ఈ సందర్భంగా దొరైస్వామి మాట్లాడుతూ కాటరాక్ట్ సర్జరీ అవసరమైన వారిని తమ వాహనాల్లో విశాఖకు తీసుకెళ్లి, అక్కడ శస్త్రచికిత్స తర్వాత వారి స్వగృహాలకు చేరుస్తామని తెలిపారు. వైద్య పరీక్షలకు హాజరైన వారికి మజ్జిగ, ఫలహారం , భోజన సదుపాయాలు కల్పించారు.

మాజీ ఎంపీటీసీ ఈశ్వరరావు కుటుంబానికి సుమన్ పరామర్శ


బాలాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సుమన్

గొలుగొండ: మాజీ ఎంపీటీసీ సభ్యుడు గండెం ఈశ్వరరావు కుటుంబాన్ని ప్రముఖ సినీ నటుడు సుమన్ ఆదివారం రాత్రి పరామర్శించారు. ఈశ్వరరావు పెద్దకుమారుడు బాలాజీ(25) ఇటీవల అనకాపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాలాజీ మేనమామ బాబులు, సుమన్ స్నేహితులు. దీంతో గొలుగొండలో ఉన్న ఈశ్వరరావు కుటుంబాన్ని సుమన్ పరామర్శించి, అండగా ఉంటామని తెలిపారు. బాలాజీ చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE
2BHK, 1189sft, W/F, Lift, Car parking, Near Highway, D-Mart Madhurawada, VSP. Cell No: 94925 10853 / 90002 60500 [SCA25008099]

Services

GOLD LOANS
లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 14303]

Wanted

Wanted Maths Teacher for 5th & 6th Classes 8:45 am to 4:45 PM. Salary Approx 15 to 18k. Wonworld School, 4-47-7, Lawsonsbay Colony, Pedawaltair. Ph : 82351 23123, 98482 37187 [V- 14383]

Hyd-రియల్ ఎస్టేట్ Co. కై మార్కెటింగ్ Exe. కావలెను. కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ ప్లాట్స్ సేల్స్ కై జీ+కమీ+2 వీలర్+రూం+బో. ఫ్రీ. Age: 32, 3.లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781 [HA-15606]

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చంటిపిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్. జీ : 18K. Ph: 9640468899, 9640258899 [SCA25008061]

సాక్షి క్లాసిఫైడ్స్
లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16.
విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా + అల్లూరి జిల్లా : నాలుగు లైన్లు రూ. 475/-
అదనపు లైను రూ. 100/- + 5% జి.ఎస్.టి. అదనం.
మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:
అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పెందుర్తిలో కూటమి సిగపట్లు

- పెత్తనం కోసం ఎమ్మెల్యే పంచకర్ల.. టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జి పాట్లు
- ఒకరిపై ఒకరు తమ తమ అధిష్టానానికి ఫిర్యాదులు
- మీడియా ముఖంగా బహిర్గతం చేసిన గండి బాబ్జి



పెందుర్తి: 'నేను పెందుర్తి ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేని. నా మీద టీడీపీ ఇన్‌చార్జిని వేసి అతనికీ అధికారాలు ఇస్తామంటే ఎలా. ప్రతీ అధికారిక సమావేశానికి ఇన్‌చార్జిలు వచ్చి పెత్తనం చేయడం ఏంటి. నియోజకవర్గంలో కూడా మాకు తెలియకుండా టీడీపీ నేతలు పనులు చేయించుకుంటున్నారు. పార్టీ ఇన్‌చార్జిలు అధికారిక కార్యక్రమాలు నిర్వహించడం ఏంటి. ఇదేనా కూటమి పొత్తు ధర్మం' రెండు నెలల క్రితం వీఎంఆర్‌డీఏ వేదికగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చేసిన వ్యాఖ్యల సారంశం.

'నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కేడర్ అంతా కలిసి పనిచేస్తేనే కూటమి అభ్యర్థి గెలిచారు. వారికి ప్రజా సమస్యలపై ఎంత బాధ్యత ఉందో మాకు అంతే బాధ్యత ఉంది. పేదలకు, దళితులకు అన్యాయం చేస్తూ అభివృద్ధి చేస్తామంటే మేం ఒప్పుకోం. పేదల పక్షాల నిలబడితే అభివృద్ధికి అడ్డుపడుతున్నామంటూ మాపై అధిష్టానానికి ఫిర్యాదులు చేస్తున్నారు. కూటమిగా అధికారంలో ఉండి ఇలాంటి చర్యలకు కొందరు పాల్పడడం మా దౌర్భాగ్యం' సబ్బవరంలో మీడియా ముఖంగా టీడీపీ ఇంచార్జి గండి బాబ్జి వ్యాఖ్యలు ఇవి.

పెందుర్తి నియోజకవర్గంలో అధికార కూటమి నాయకులైన జనసేన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జి మధ్య ఆధిపత్య పోరు తీవ్రమైంది. ఇద్దరు నాయకులు బహిరంగంగానే ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. కొన్ని ప్రభుత్వ కార్యక్రమాలకు కలిసి హాజరవుతున్నప్పటికీ, లోపల మాత్రం వారి మధ్య విభేదాలు ఉన్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా నియోజకవర్గంలోని వివాదాస్పద పనుల విషయంలో ఇద్దరూ భిన్నమైన వైఖరి తీసుకుంటూ అధికారులకు ఇబ్బందులు సృష్టిస్తున్నారని సమాచారం. తమ చెప్పుచేతల్లో అధికార యంత్రాంగాన్ని పెట్టుకోవడానికి ఇద్దరూ తీవ్రంగా పోటీ పడుతున్నారు. పంచకర్ల రమేష్ బాబు తాను ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి సుప్రీం అని భావిస్తుండగా, గండి బాబ్జి ఎన్నికల్లో తన కృషికి ఫలితంగా విజయం దక్కిందని, ఎమ్మెల్యేతో సమానంగా గౌరవం కావాలని పట్టుబడుతున్నారు. రెండు నెలల క్రితం వీఎంఆర్‌డీఏ సమీక్షలో కూడా వారి మధ్య వివాదం తలెత్తినట్లు సమాచారం. తాజాగా, సబ్బవరంలో ఒక అభివృద్ధి పని విషయంలో ఇరువురి మధ్య విభేదాలు మరోసారి బయటపడ్డాయి. దీనిపై గండి బాబ్జి శనివారం మీడియా ముందు మాట్లాడుతూ, 'పేదల భూములు లాక్కొని అభివృద్ధి చేస్తారా? నేను బాధితుల తరఫున మాట్లాడితే, మా పొత్తులో ఉన్నవారే మా అధిష్టానానికి నాపై ఫిర్యాదులు చేస్తున్నారు. ఇలాంటి దౌర్భాగ్యమైన స్థితిలో ఉన్నాం' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు పెందుర్తి నియోజకవర్గంలో కూటమి నాయకుల మధ్య సఖ్యత లేదనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

తొలి నుంచీ తలో దారే

పెందుర్తిలో జరుగుతున్న ప్రతీ అంశంలోనూ ఎమ్మెల్యే పంచకర్లకు, గండి బాబ్జికి మధ్య సఖ్యత ఉండడం లేదన్నది బహిరంగ రహస్యమే. ఇటీవల కాలంలో వీరి మధ్య మరింత దూరం పెరిగింది. పెందుర్తి పీఏసీఎస్ చైర్మన్‌గా పంచకర్ల సిఫార్సుతో జనసేన నాయకుడు అయిత సింహాచలంని నియమించారు. నెల రోజుల క్రితం జరిగిన చైర్మన్ ప్రమాణ స్వీకారానికి కూటమిలోనే ఉన్న గండి బాబ్జి ముఖ్యం చాటేశారు. అతనితో పాటు టీడీపీ నాయకులెవరూ ఆ కార్యక్రమానికి హాజరు కాలేదు. చివరకు పీఏసీఎస్ సభ్యుడిగా నియమితులైన చిరికి అవతారం కూడా కార్యక్రామనికి హాజరు కాలేదు(తరువాత పీఏసీఎస్ కార్యాలయంలో బాధ్యత స్వీకరించారు). ఈ క్రమంలో పెందుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా టీడీపీ ఇంచార్జి గండి బాబ్జీ లేఖతో అతని అనుచరుడు అవగడ్డ అప్పలనాయుడు భార్య జ్యోతిని నియమించారు. అయితే జ్యోతి ప్రమాణ స్వీకారం చేస్తున్న సభకు కేవలం కిలో మీటర్ దూరం వరకు వచ్చిన పంచకర్ల రమేష్‌బాబు సహా జనసేన కేడర్ అంతా వెనుదిరిగారు. ఇక పంచకర్ల అనుచరులు చింతగట్లలో ఐదెకరాల భూమిపై కన్నేసి తప్పుడు పత్రాలు సృష్టిస్తే దాన్ని గంటి బాబ్జీ వర్గీయులు అడ్డుకున్నట్లు బహిరంగంగానే చర్చ జరిగింది. ఇలా చెప్పుకుంటూ పోతే తాజాగా నియోజవర్గంలో పరిణామాల బట్టి పంచకర్ల రమేష్‌బాబు, గండి బాబ్జీ పోరు తారాస్థాయికి చేరుకున్నట్టే కనిపిస్తుంది.

ఆధిపత్య పోరు

పెందుర్తి నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జి మధ్య ఎన్నికల నుంచే కొనసాగుతున్న ఆధిపత్య పోరు ఇప్పుడు అధికారులకి పెద్ద తలనొప్పిగా మారింది. వీరిద్దరూ అధికారంలోకి రావడమే లక్ష్యంగా కలిసి పనిచేశారు తప్ప, వారి మధ్య విభేదాలు మాత్రం ఇంకా కొనసాగుతున్నాయి.

అధికారుల బదిలీలు, ఒత్తిళ్లు

అధికారం చేపట్టిన వెంటనే అధికారుల బదిలీల విషయంలోనే ఈ ఇద్దరు నాయకుల మధ్య విభేదాలు మొదలయ్యాయి. పంచకర్లకు పోటీగా గండి బాబ్జి కూడా తన సిఫార్సులను అధికారులకు పంపారు. బాబ్జికి జిల్లా.. రాష్ట్రస్థాయి నాయకులతో ఉన్న పరిచయాల కారణంగా ఆయన సిఫార్సులకు ప్రాధాన్యత లభించడం, పంచకర్ల సిఫార్సులు కొన్నిసార్లు అమలు కాకపోవడం ఆయన అసహనానికి కారణమైంది. అంతేకాకుండా, ఎమ్మెల్యేకు పోటీగా బాబ్జి ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడం, పీజీఆర్ఎస్ కార్యక్రమాలు చేపట్టడం, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయడం వంటివి కూడా పంచకర్లకు మరింత కోపం తెప్పించాయి. ఈ కోపాన్ని ఇద్దరు నాయకులు అధికారులపై చూపుతున్నారు. ఒకే పని విషయంలో ఒకరు 'వద్దు' అంటే, మరొకరు 'చేయాలి' అని తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తుండటంతో అధికారులు ఎవరి మాట వినాలో తెలియని పరిస్థితిలో ఉన్నారు.

ప్రజలకు మేలు చేసేదెవరు?

ఈ ఆధిపత్య పోరులో ప్రజల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఈ 15 నెలల కాలంలో ఇద్దరు నేతలు తమ తమ పార్టీల నాయకులకు, కార్యకర్తల కోసం మాత్రమే పనిచేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీర్ఘకాలికంగా ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించడానికి బదులుగా, కేవలం తమ కార్యకర్తలకు మేలు చేయడానికి, వారు కేసుల్లో ఇరుక్కుంటే కాపాడడానికి, ప్రభుత్వ భూముల ఆక్రమణలను అడ్డుకోవడానికి మాత్రమే ఈ నేతలు ఉత్సాహం చూపిస్తున్నారని ప్రజలు ఆక్షేపిస్తున్నారు. ఈ నేతల వేధింపులు తాళలేక చాలా మంది అధికారులు బదిలీలపై వెళ్లిపోయారని కూడా ఆరోపణలు ఉన్నాయి. తమకు నచ్చని అధికారులను వేధించి బదిలీ చేయించడం కోసం మాత్రమే ఈ నేతలు అధికారాన్ని పంచుకుంటున్నారని పెందుర్తి ప్రజలు మండిపడుతున్నారు.

క్లుప్తంగా

సత్తెమ్మతల్లి గుడికి విరాళం



సిమెంట్ బస్తాల నిమిత్తం విరాళం అందజేస్తున్న గాంధీ

మునగపాక: స్థానిక చెరువు కాలువ సంఘ పరిధిలో సత్తెమ్మతల్లి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు తమవంతు సాయం అందజేస్తున్నారు. దీనిలో భాగంగా మూలపేటకు చెందిన కాండ్రేగుల గాంధీ ఆలయ నిర్మాణానికి 25 బస్తాల సిమెంట్‌కు అవసరమయ్యే విరాళం అందజేశారు. కార్యక్రమంలో కర్రి రామజోగినాయుడు, బొడ్డేడ అప్పలనాయుడు, వెలగా వెంకటప్పారావు, ఆడారి జగ్గారావు, దాడి సూరప్పారావు, దాడి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



బీఆర్టీ కాలనీ మొక్కలను నాటుతున్న గ్రీన్ క్లబ్ సభ్యులు

అనకాపల్లి: భావితరాలను దృష్టిలో పెట్టుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్టీ కాలనీ గ్రామ సర్పంచ్ యల్లపు రమేష్, ఎంపీటీసీ మొల్లేటి శివాజీ తెలిపారు. గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణి భూషన్ శ్రీధర్ ఆధ్వర్యంలో మండలంలో బీఆర్టీ కాలనీలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేప, బాదం, పనస, రావి, మామిడి మొక్కలను నాటడమే కాకుండా వాటి పరిరక్షణతో ముస్ముందు పరిశుభ్రమైన గాలిని పీల్చవచ్చన్నారు. ప్రతి చెట్టు ఒక ప్రకృతి ప్రాణమని, మొక్కలను పెంచి పచ్చదనాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు యల్లపు వెంకటరావు, దొడ్డి సూరిబాబు, గ్రీన్ క్లబ్ సీనియర్ సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ, నయిశెట్టి సత్తిబాబు, బి.శేష సాయి, వంకాయల ఈశ్వరరావు, ఎం.బంగారురాజు, కె.నీలవేణి, జి.రంజిత, బి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు నివారణకు టీకాలు

అనకాపల్లి: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలం, పట్టణంలో ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు పశువులకు ఉచిత గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తామని మండల పశుసంవర్ధక శాఖ అధికారి సీహెచ్ అనిల్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ, మండల పరిధిలో 15,700 పశువులకు ఈ టీకాలు వేస్తామన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోరాట యోధుడు సీతారాం ఏచూరి

రాంబిల్లి(అచ్యుతాపురం): సమ సమాజ స్థాపన కోసం కామ్రేడ్ సీతారాం ఏచూరి తన జీవితాన్నే ధారబోశారని రాంబిల్లి మండలం సీపీఎం కార్యదర్శి జీ దేవుడు నాయుడు తెలిపారు. ఆదివారం రాంబిల్లిలో కామ్రేడ్ సీతారాం ఏచూరి మొదటి వర్ధంతిని పురస్కరించుకుని సీపీఎం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవుడునాయుడు మాట్లాడుతూ కార్మికులు, కర్షకుల కోసం సీతారాం ఎన్నో పోరాటాలు చేశారన్నారు.
లౌకిక వాదం కాపాడాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని నిరంతరం పోరాట యోధుడిలా ఉండేవారని అన్నారు. ఇప్పటి తరం నేతలు స్ఫూర్తిగా తీసుకొని ప్రజల కోసం పోరాటాలు చేయాలని, అక్కడి వారితో ప్రతిజ్ఞ చేయించారు. చందక రామకృష్ణ, వై.రాము, ధోని కాసియా, భూపతి అప్పారావు, డి.నర్సింగరావు, వి.ఆదిరెడ్డి, శ్రీను, పారిపిల్లి పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

రాజా	:మదరాసి
సత్యనారాయణ స్క్రీన్-1	:కిష్కింధపురి
సత్యనారాయణ స్క్రీన్-2	: కొత్త లోక
పర్తిసాయి	: ఘాటీ
షిర్డీసాయి	: కూలీ
వెంకటేశ్వర	: లిటిల్ హార్ట్స్
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 77 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-16, బీ పాజిటివ్-22, ఓ పాజిటివ్-34, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 253 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 217 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.



వడ్డి వీధి- శారదా వంతెన రోడ్డు పక్కన పెరిగిన తుప్పలు



చర్చి నుంచి కనకమహాలక్ష్మి వీధి రోడ్డులో పెరిగిన తుప్పలు



గాడి వీధి నాగేంద్ర కోట- శ్మశాన రోడ్డులో తుప్పలు

అధ్వానంగా రోడ్లు

- అడుగడుగునా గోతులమయం
- దారి పొడవునా పిచ్చిమొక్కలు
- విష సర్పాలతో భయాందోళన



నీటి ముంపునకు గురవుతున్న భవానీకాలనీ రోడ్డు

కశింకోట: గ్రామీణ రోడ్లు ఓ వైపు గోతులమయమై ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. మరోవైపు వీటికి ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోయి విష సర్పాలకు నిలయంగా మారాయి. దీంతో ఏ క్షణాన్న ఎటువంటి హాని జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికి పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. బిక్కు, బిక్కుమంటూనే జీవనం సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు.
మండలంలోనే అతి పెద్ద మేజర్ పంచాయతీ కశింకోటలో 20 వేల జనాభా ఉంది. గ్రామంలో పలుచోట్ల రోడ్లు రెండు వైపులా తుప్పలు పెరిగి అధ్వానంగా ఉన్నాయి. కోమటి వీధి నుంచి జాలారి పేట వైపు వెళ్లే రోడ్డు, స్థానిక సంతబయల బాప్టిస్టు చర్చి వద్ద నుంచి కనకమహాలక్ష్మి వీధి రోడ్డు, గాడి వీధి నాగేంద్ర కోట నుంచి శ్మశానం వైపు వెళ్లే రోడ్డు, వడ్డి వీధి మర్రిచెట్టు వద్ద కోట దిబ్బ, శారదా నది వంతెనకు వెళ్లే రోడ్డు, అగ్రహారం వీధి రోడ్లు, రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు, సత్తెమ్మ కాలనీ, మసీదు వెనుక రోడ్డు తదితర ప్రాంతాల్లో రెండు వైపులా తుప్పలు పెరిగి ఉన్నాయి. దీంతో అవి విష సర్పాలు, తేళ్లు, పురుగులకు నిలయాలుగా మారాయి. అవి ఒక్కొక్కసారి రోడ్లపై సంచరిస్తూ రాకపోకలు సాగించే ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఈ విషయాన్ని పంచాయతీ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. దీంతో భయంతోనే గత్యంతరం లేక బిక్కు బిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు.

భయంగా ఉంది



రోడ్డు పక్క తుప్పలు బలిసి అధ్వానంగా ఉన్నాయి. దీంతో విష సర్పాలు, పురుగులు వంటివి సంచరిస్తున్నాయి. వీటివల్ల ఏ క్షణంలో ఎటువంటి హాని జరుగుతుందోనని ఆందోళనగా ఉంది. దీనిదృష్ట్యా రోడ్లు పక్క తుప్పలను తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రంగాల పద్మ, కశింకోట

వర్షం వస్తే ముంపులో రోడ్లు

వర్షం వస్తే చాలు పలుచోట్ల రోడ్లు నీటి ముంపునకు గురవుతున్నాయి. ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా జాతీయ రహదారి నుంచి పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డు ఏ మాత్రం వర్షం పడినా పల్లంగా ఉండటం వల్ల నీటి ముంపునకు గురవుతోంది. ఈ మార్గం మీదుగా ఎంపీడీవో కార్యాలయం, అఫీషియల్ కాలనీ, సమగ్ర బాలికల వసతి గృహానికి విద్యార్థులను చూడటానికి వచ్చే తల్లి దండ్రులు తరచుగా రాకపోకలు సాగిస్తుంటారు. అయితే వర్షం వస్తే నీటి ముంపునకు గురవుతోంది. నీరు పోవడానికి మార్గాన్ని ఏర్పాటు చేసినా నీరు పూర్తిగా పోకుండా నిల్వ ఉండిపోతోంది. దీంతో రాకపోకలు సాగించడానికి ఇబ్బంది చెందక తప్పని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అలాగే స్థానిక భవానీ కాలనీ, రైల్వే స్టేషన్ రోడ్డు కూడా వర్షం వస్తే నీటి ముంపునకు గురవుతోంది. కాలువలు ఉన్నప్పటికి అవి ఎత్తుగా ఉండటం, రోడ్డు పల్లంగా ఉండటం వల్ల ఈ దుస్థితి నెలకొంటుంది. ఈ రోడ్డు మీదుగా రైల్వే స్టేషన్, ఇందిరా కాలనీ, సత్తెమ్మ కాలనీ, సంపతిపురం తమ్మయ్యపేట తదితర గ్రామాలకు నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. నీరు నిల్వ ఉండిపోతుండటంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోతుందని స్థానికులు వాపోతున్నారు. ఆ నీటిలోనే తీవ్ర ఇబ్బంది పడుతూ జీవనం సాగించాల్సి వస్తోందని కాలనీ వాసులు వాపోతున్నారు. అగ్రహారం వీధి రోడ్లు, స్టేట్ బ్యాంకు వద్ద రోడ్డులో కూడా వర్షపు నీరు నిల్వ ఉండిపోయి ఇబ్బంది చెందాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. దీనిదృష్ట్యా ఆయా ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా, రోడ్ల పక్క తుప్పలు తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



వర్షం పడితే నీటి ముంపునకు గురవుతున్న జాతీయ రహదారి-పీహెచ్‌సీ రోడ్డు



నీటి ముంపునకు గురవుతున్న రైల్వే స్టేషన్ రోడ్డు



తుప్పలు పెరిగిన ఉన్న కోమటి వీధి-జాలారి పేట రోడ్డు

22 నుంచి కామాక్షిదేవి నవరాత్రుల ఉత్సవాలు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నిదానందొడ్డి కామాక్షిదేవి దసరా నవరాత్రులను ఈ నెల 22వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఇక్కడ ఆలయ ఆవరణలో ఆదివారం వారు ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కామాక్షిదేవి ఆలయ కమిటీ పట్టణ అధ్యక్షుడు పొన్నాడ వెంకట సత్యనర్సింగ్ ఆచారి (పెదబాబు) మాట్లాడుతూ 22న ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగింపు చేస్తామన్నారు. నవరాత్రుల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారన్నారు. రోజూ సాయంత్రం వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్రపై భాగవతారిణి ఎస్. భారతి హరికథా గానం ఆలపిస్తారన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి యండపల్లి మోహన్ బ్రహ్మజీ, కోశాధికారి కిలాడ శ్రీనివాసరావు, పట్టణ స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు వెదురుపాటి సుందరయ్య (బాబి), పట్టణ కార్పెంటర్ సంఘం అధ్యక్షుడు కోరుకొండ వెంకటరావు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

సామాజిక సద్భావన కోసమే ఉత్సవ సమితి

రాష్ట్ర గణేష్ ఉత్సవ సమితి కార్యవర్గ సభ్యుడు విల్లూరి శ్రీనివాసరావు



జిల్లా గణేష్ ఉత్సవ సమితి కమిటీ సభ్యులు

అనకాపల్లి: ధార్మిక చింతన, సామాజిక సద్భావన, పర్యావరణ పరిరక్షణ కోసమే రాష్ట్ర గణేష్ ఉత్సవ సమితి ఏర్పడిందని సంబంధిత సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విల్లూరి శ్రీనివాసరావు తెలిపారు. సమితి జిల్లా అధ్యక్షుడు బంకుపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ఆదివారం కార్యవర్గ సమావేశం జరిగింది. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ, బాల గంగాధర్ తిలక్ గొప్పతనాన్ని తెలియజేస్తూ హిందూ ధర్మానికి వారు చూపిన మార్గమే మనకు శిరోధార్యమన్నారు. తొమ్మిది రోజులతో వినాయక ఉత్సవాలు ముగిసి పోలేదని, ధర్మ చింతన, పర్యావరణ పరిరక్షణ సామాజిక సద్భావన కలిగి ఉండాలన్నారు. వినాయక నవరాత్రులను నిర్వహించిన ప్రతి ఒక్కరూ అభినందనీయులన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రచారక్ జిల్లా ప్రతినిధి వి.హరి, నియోజకవర్గ కన్వీనర్ దాడి వాసు, సభ్యులు కాండ్రేగుల హైమావతి, బొడ్డేడ అప్పారావు, ఆళ్ల ప్రవీణ్ కుమార్, పంచాడ హరినాథ్, వెలగ జగన్నాథం, కోరిబిల్లి రమేష్, దాడి వెంకట సన్యాసిరావు, కుంచా చిన్న, నీలేష్ గుప్తా, మళ్ల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభాలు

6 నెలలుగా చీకట్లో ఇబ్బందులు



బయ్యవరం వద్ద విరిగి నిరుపయోగంగా సోలార్ విద్యుత్ స్తంభం



విరిగిన మరో సోలార్ విద్యుత్ స్తంభం

కశింకోట: మండలంలోని బయ్యవరంలో జాతీయ రహదారి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటిలో రెండు సోలార్ విద్యుత్ స్తంభాలు విరిగి నేలకొరిగాయి. ఇవి విరిగి ఆర్నెల్లవుతున్నా పునరుద్ధరించకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో సరైన వెలుగు లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఏడాదిన్నర క్రితం జాతీయ రహదారి నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో రోడ్డుకు రెండు వైపులా 20 సోలార్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. వీటికి రూ.25 లక్షలు ఖర్చు చేశారు. వీటి ద్వారా బయ్యవరం వద్ద జాతీయ రహదారిపై లైట్లు వెలుగులు నింపుతున్నాయి. ఆర్నెల్ల క్రితం వీటిలో రెండు స్తంభాలు విరిగి నేలకొరిగాయి. వీటిని పునరుద్ధరించే చర్యలు చేపట్టలేదు. దీంతో అవి నిరుపయోగంగా పడి ఉన్నాయి. దీంతో రోడ్డుపై కాస్త వెలుగు తగ్గడంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. దీనిదృష్ట్యా విరిగిన స్తంభాలను పునరుద్ధరించి యథావిధిగా సోలార్ లైట్లు వెలిగించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టీడీఆర్ బాండ్లకు వ్యతిరేకం



నిర్వాసితులతో ఆందోళన చేపడుతున్న సీపీఎం నాయకులు

అచ్యుతాపురం రూరల్: రోడ్డు విస్తరణలో నిర్వాసితులు టీడీఆర్ బాండ్లకు వ్యతిరేకిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు తెలిపారు. అనకాపల్లి రోడ్డు విస్తరణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హరిపాలెంలో నిర్వాసితులు చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. రోడ్డు విస్తరణలో కోల్పోతున్న ఇల్లు, స్థలాలు, భవనాలు, వ్యాపార సముదాయాల బాధితులకు 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలని కోరారు. వీరికి టీడీఆర్ బాండ్లకు బదులు నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు. రేటు నిర్ణయించిన రోజు నుంచి ప్రకటించిన ధరకి రేట్ ఆఫ్ ఇంట్రస్ట్ చెల్లించాలన్నారు. వందడుగుల తర్వాత ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా ఆటంకం కలిగించకూడదన్నారు. ఇల్లు, షాపులు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించాలన్నారు. నిర్వాసితుల సంఘం కన్వీనర్ రొంగలి రాము, రైతు సంఘం అధ్యక్షులు కర్రి అప్పారావు, బ్రహ్మజీ, బాబూరావు, రామ్ కుమార్, నాయుడు, రంగారావు పాల్గొన్నారు.

భగవద్గీత ప్రశాంత జీవనమార్గం



భగవద్గీతపై అవగాహన కల్పిస్తున్న బోధకుడు పరదేశినాయుడు

మునగపాక: ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవడం ద్వారా జీవితం సుఖమయంగా ఉంటుందని విశ్రాంత ఇంజినీరింగ్ అధికారి శరగడం పరదేశినాయుడు పేర్కొన్నారు. మండలంలోని తిమ్మరాజుపేటలో వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో భగవద్గీత శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భగవద్గీతపై అవగాహన పెంచుకోవడం ద్వారా ప్రశాంత జీవితం సాగించవచ్చన్నారు. మానసిక ప్రశాంతత దొరుకుతుందన్నారు. చదువులో రాణించవచ్చన్నారు. ప్రతీ ఆదివారం జరిగే ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

పరవాడ డీఎస్పీ సందర్శన

మునగపాక: స్థానిక పోలీసు స్టేషన్‌ను పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ ఆదివారం సందర్శించారు. ఇక్కడ పెండింగ్ కేసుల వివరాలను ఎస్ఐ ప్రసాదరావును అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. గంజాయి, మద్యం తదితర చెడు వ్యసనాలకు గురికాకుండా యువతకు అవగాహన కల్పించాలని సూచించారు.

బూడిద లారీలతో అవస్థలు

పరవాడ: లంకెలపాలెం సమీపంలోని ఏలేరు కాలువ వద్ద రోడ్డు ఇరుకుమయంగా మారడంతో సాధారణ ప్రయాణికులు, ఫార్మాసిటీ ఉద్యోగులు, కార్మికులు నిత్యం ఇబ్బందులకు గురువుతున్నారు. ఈ రహదారిలో రోజూ వందల సంఖ్యలో బూడిద లారీలు, ఫార్మాసిటీ బస్సులు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. సింహాద్రి ఎన్టీపీసీ బూడిద చెరువుల నుంచి బూడిదను వివిధ ప్రాంతాలకు తరలించే భారీ వాహనాలు ఇక్కడ ఏలేరు కాలువ వద్ద మలుపు తిరిగే క్రమంలో తరచూ ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి. అధిక బరువుతో రాకపోకలు సాగించే బూడిద లారీలు ఏలేరు కాలువ వద్ద ఇరుకు రోడ్డులో మలుపు తిరిగే సమయంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉదయం 9 నుంచి 10, సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య సమయంలో ఫార్మాసిటీ ఉద్యోగులు, కార్మికులు విధులకు రాకపోకలు సాగిస్తుంటారు. ఆ సమయాల్లో ఏలేరు కాలువ వద్ద బూడిద లారీలు సృష్టించే ట్రాఫిక్ వలయంలో గంటల తరబడి చిక్కుకుపోతున్నారు. ఏలేరు కాలువ వద్ద తలెత్తుతున్న బూడిద లారీల ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి సకాలంలో విధులకు హాజరు కాలేకపోతున్నామని ఫార్మాసిటీ ఉద్యోగులు, కార్మికులు వాపోతున్నారు. ఫార్మా కార్మికులతో పాటు ఎన్టీపీసీ, ఎస్ఈజెడ్ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు, సాధారణ ప్రయాణికులు కూడ అనేక అవస్థలు పడుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాల రాకపోకలతో రోడ్డంతా ధ్వంసం కావడంతో రాళ్లు తేలిపోయి వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. బూడిద లారీల ద్వారా విడుదలయ్యే దుమ్ము, ధూళితో ప్రయాణికులు తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారు. అలాగే బూడిద లారీల ద్వారా ఎగసిపడుతున్న దుమ్ము, ధూళితో ఇక్కడ రాంకీ కూడలిలో టీ, పాన్ షాపులు నడుపుతున్న చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. ఏలేరు కాలువ మలుపు వద్ద బూడిద లారీల రాకపోకల నియంత్రించేలా చర్యలు చేపట్టాలని ఫార్మా ఉద్యోగులు, కార్మికులు కోరుతున్నారు.



బూడిద లారీలతో అవస్థలు పడుతున్న ఫార్మా ఉద్యోగులు, కార్మికులు



ఇరుకు రోడ్డులో తప్పించుకోవడానికి ఇబ్బందులు పడుతున్న బూడిద లారీలు













